19.

# మానవజీవితం చాలా విలువైనది

**వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్**
**జీవి మనసు తెరను చీల్చలేవు**
**తెరకు యివల జీవి దేవుడవ్వల నుండు**
**కార్యమివలనవల కారణంబు.**

ప్రేమస్వరూపులారా!

ప్రాచీన కాలమునుండి వేద ప్రభావముచేత, భారతదేశము అన్ని దేశములకు ఆధ్యాత్మిక సంపత్తిని బోధిస్తూ, ప్రబోధిస్తూ 'లోకాః సమస్తాః సుఖినోభవంతు' అన్నటువంటి ఒక ప్రధానమైనట్టి సూత్రములు జగత్తునకందించినది. ఈనాటి మానవుడు లౌకికంగా, వైజ్ఞానికముగా ఎంతయో ప్రగతిని సాధించాడు కాని నైతికముగా, ధార్మికముగా, దినదినమునకు అతని మానవత్వం దిగజారిపోతున్నది. మానవుడు ఏమి చేసినా, ఏమి చూచినా, ఏమి తలచినా, ఏమి అనుభవించినా యివన్నియు స్వార్థమునకు అడ్డుగా తగిలి అనేక విధములైనట్టి ప్రయోగములచేత, తనయొక్క వ్యక్తిత్వాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు. ఈనాటి మానవుడు స్వార్థము చేతిలో కీలుబొమ్మయి జీవిస్తున్నాడు. ఇట్టి స్వార్థ, స్వప్రయోజనాలచేత మానవత్వమే కోల్పోయి కేవలము పశుత్వాన్ని అనుభవిస్తున్నాడు. మానవజీవితము చాలా విలువైనటువంటిది. జీవించ తగినట్టిది. ఇట్టి పవిత్రమైన జీవితాన్ని సార్థకము గావించుకొనక, వ్యర్థము చేసుకోవడము మానవత్వానికి కళంకము. ఈనాటి మానవుడు జీవితాన్ని సార్థకము గావించుకొనక తను కోరినట్లు జీవిస్తూ, వచ్చినట్లుగా చేస్తూ, అనుభవించని రీతిలో అనుభవిస్తున్నాడు. 'నశ్రేయో నియమం వినా' దేనికైనను ఒక నియమము అత్యవసరము. ఒక నది ప్రవహిస్తోంది. ఈ ప్రవహించేటట్టి నదికి కొంత గట్టు లేకపోతే యిది గ్రామాలపై పడి అనేక అపకారములకు గురి చేస్తుంది. అదే నదికి రెండు గట్టులు కట్టినప్పుడు ఇది జనోపకారిగా ఉండి జీవితాన్ని సార్థకము గావిస్తుంది. అదియే

sri sathyasai vachanamrutam

రెండు గట్లు అష్టాక్షర నామముతో కూడినట్టివి రెండు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' ఇది ఒక వైపు గట్టు. 'సంశయాత్మా వినశ్యతి' యిది రెండవ గట్టు.

**జీవిత ప్రవాహానికి రెండు గట్లు**

మొట్టమొదట మానవునికి సంశయాత్మా వినశ్యతి, యీ అష్టాక్షర నామాన్ని సార్థకము చేసుకోవాలి. సంశయముండినంతవరకుమానవుడు ఏ చిన్న కార్యము కూడను సాధించలేడు. విజయాన్ని అందుకోలేడు. నిస్సంశయముగా ఏ కార్యమునందైనా తను ముందంజ వేయాలి. ఇదియే మన జీవిత ప్రవాహమునకు ఒక వైపు గట్టు. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం ఈ ఎనిమిది అక్షరములయొక్క గట్టు మరొక వైపుది. ఈ రెండు గట్లు మధ్యలోన మానవ జీవితమనేటి నది ప్రవహించి అనుగ్రహమనే సాగరములో లీనమవుతుంది. కనిపించే వృక్షమునకు కనిపించని వేర్లకు నీరు పోయాలి. కాని కనిపించనిది, వినిపించనిది నీ కర్మల గల మర్మము జీవా! వేర్లను భద్రము చేయకున్న, వేర్లను కాపాడక పోయిన, వృక్షమే కూలిపోతుంది. జీవితమే ఒక ఫైర్‌వుడ్ మాదిరి తయారౌతుంది. నీరు లేనప్పుడు యీ చెట్టు ఏమైపోతుంది? ఎండిపోతుంది. ఎండిపోయిన వృక్షములో ఏ విధమైనట్టి ఫలమును మనమందుకోలేము. కనుక ప్రతి మానవుడు కూడను యీ సంశయమనేటి దానిని నిర్మూలము గావించి, నిస్సంశయముతో భగవంతుని సేవించడానికి పూనుకోవాలి. ఏ కార్యమునకైనా కూడను యీ రెండు గట్లు లేకుండిన, విజయాన్ని సాధించలేరు. 'ఓం నమో నారాయణాయ', ఇది కాదు అష్టాక్షరనామము. ఇది భగవంతునికున్నట్టి ఒక పేరు. కాని నిస్సంశయమనేటిదే నిజమైనట్టి యొక మార్గము. సం-శ-యా-త్మా-వి-న-శ్య-తి, ఈ ఎనిమిది అక్షరములే నిజమైనట్టి యొక మార్గముగా నిరూపించినట్టివి. ఈ సంశయములో లేకుండిన, మానవుడు సాధించలేనట్టిది యీ జగత్తులో ఏదీ లేదు.

ఇంక రెండవది, 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' ఈ నిస్సంశయమనేటిది యీ మానవ జీవితమనే వృక్షమునకు వేర్లవంటిది. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం. ఇదియే వృక్షముయొక్క ఫలములు. పైన ఫలము క్రింద వేరు. పైన ఫ్రూట్, క్రింద రూట్ మధ్యలో అనేక విధమైనట్టి కొమ్మలు, రెమ్మలు, ఆకులు ఇవన్నీ కూడ చేరియుంటాయి. మానవుడు చెట్టును నాటేది దేని

srisathyasaivachanamrutam

కోసమని? ఫలము నిమిత్తమై చెట్టును నాటుతున్నాడు. ఫలమే లేకున్న చెట్టునే నాటడు. కనుక మానవ జీవితమనేటి వృక్షమునకు ఫలము ఏమిటి? అదియే పూర్ణ జ్ఞానము. పరిపూర్ణ విశ్వాసమే యీ వృక్షమునకు బలమైనట్టి వేరు. మానవ జీవితమును పెంచుకుని, ఆ మానవ జీవితమందున్నట్టి మనస్తత్వాన్ని విచారణ గావించుకుని, ఈ మానసిక విశాలమునకు తగినట్టుగా వాక్ అభివృద్ధి పరచుకున్నప్పుడే మానవత్వం సార్థకమవుతుంది.

**అన్నం బ్రహ్మ రసోవిష్ణుః**

దీనిని పురస్కరించుకొనియే, ప్రాచీన సాధకులంతా పండితులందరు కొన్ని మంత్రములు బోధిస్తూ వచ్చారు. అన్నం బ్రహ్మ, రసో విష్ణుః. అన్నం బ్రహ్మ ఈ అన్నమనేటిది ఈ దేహములో ప్రవేశించి, దేహములో సర్వత్రా ప్రసరించి, దేహమునకు పుష్టిని, సంతుష్టిని ఇచ్చేటటువంటిది. ఈ పుష్టితో, సంతుష్టితో ఉన్నటువంటి దేహమునందు దానిని కాపాడే నిమిత్తమై, సద్వినియోగ పరచే నిమిత్తమై మనస్సు సరియైనట్టిదిగా ఉన్నదని ప్రార్థించడమే. యద్దోదేవ మహేశ్వరః ఈ మహేశ్వరుడేవరు? అనగా మనసు సరియైన మార్గములో ప్రవేశపెట్టి, యీ మనసుద్వారా వాక్కును ప్రవేశపెట్టి, ఈ వాక్కుద్వారా సార్థకము పొందడమే. దేహమే బ్రహ్మ. కేవలము ఒక మనసే విష్ణువు, వాక్కే మహేశ్వరుడు. ఈ మూడింటియొక్క తత్త్వమును పురస్కరించుకొనియే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులయొక్క పేర్లను సార్థకము చేసుకున్నారు. కనుక మానవదేహము బ్రహ్మస్వరూపమైనట్టిదే. ఈ బ్రహ్మయందు మనసనేటువంటిది ఒక విష్ణువు, సర్వత్రా వ్యాపించినట్టివాడు. విష్ణువనగా సర్వవ్యాపకత్వంతో కూడినట్టివాడు. కనుక మన మనస్సు సర్వత్రా ఉంటున్నది. 'మనోమూలం మిదం జగత్' జగత్తంతా వ్యాపించియుంటుంది మనస్సు. విష్ణువనే యీ మనసు సర్వత్రా ప్రచారము చేస్తుంటాడు. కనుక మనసు విష్ణువన్నారు. యద్దోదేవో మహేశ్వరః. ఈ మహేశ్వరుడనగా ఎవరు? వాక్కే. ఈ శబ్దముతో కూడినట్టి వాక్కే నిజమైనట్టి మహేశ్వరుడు. కనుకనే ప్రాచీన మహర్షులంతా కూడను శబ్ద బ్రహ్మమయి మొట్టమొదట శబ్దం చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి. కనుకనే ఈ వాక్కునుండియే, అష్టస్వరూపములు కూడను



sri sathyasai vachanamrutam

ఆవిర్భవిస్తున్నాయి.

కనుక మానవత్వం ఏదో కించిత్తయినదిగా భావించరాదు. మానవత్వంయొక్క దివ్యత్వాన్ని గుర్తించుకొని వర్తించడమే నిజమైనట్టి జీవితము, కేవలము చేతులు, కాళ్ళతో కూడి, మొహములతో కూడి, కన్నులతో కూడి, చెవులతో కూడి యీ లోక సంబంధమైన విషయాలంతా అనుభవించుకునే నిమిత్తమై యీ దేహాన్ని అనుగ్రహించలేదు. 'శరీర మాద్యం ఖలుధర్మ సాధనమ్' ధర్మాన్ని పోషించి, ధర్మాన్ని ప్రచారము చేసి, ధర్మాన్ని అనుభవించే నిమిత్తము దేహాన్నిచ్చాడు. ఈ ధర్మము అనగా ఏమిటి? అదియే మనసుయొక్క భావము దేహముయొక్క సంకల్పము, వాక్కుయొక్క స్వరూపము. దేహ, మనో, వాక్కుయొక్క స్వరూపమే నిజమైనట్టి మానవత్వం. భగవంతుడు సర్వదేహములయందు కూడను సాక్షాత్కరిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితిని మనము గుర్తించుకోవడానికి ప్రయత్నించటం లేదు. భగవంతుడు సర్వత్రా వ్యాపించి నట్టివాడు. అట్టి సర్వవ్యాపకుడైనట్టి భగవంతునకు ఒక చిన్న మందిరము కట్టడము, చిన్న జ్యోతి వెలిగించడము, కేవలము ఒక విధమైనట్టి కర్తవ్యముతో హారతి యివ్వడము అన్నతోయములిచ్చి, భగవంతునికి నైవేద్యము చేయడము, యీ విధమైనట్టి ఒక సంకుచితమైన భావముతో మానవుడు జీవిస్తున్నాడు.

**బ్రహ్మాండమంతయు బొజ్జలోనుండంగ**
**భక్ష్యభోజ్యము నాకు పెట్టనగునె**
**సర్వజీవులయందు సంచరించెడి నాకు**
**సరియైన పేరిడ సాధ్యమగున**
**సర్వజలంబుల సంచరించెడి నాకు**
**స్నానంబు చేయింపనలవియగున**
**కోటిసూర్యుల కాంతి మేటి కల్గిన నాకు**
**ప్రమిద దీపమునెట్లు పెట్టగలరు**
**అజహరాదులకైనను అందనట్టి**
**ఇట్టి నా రూపు కనుగొన నెవరి తరము**

sri sathyasai vachanamrutam

**ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ప్రేమస్వరూపులారా! సర్వత్రా యుండినట్టిది భగవంతుడే. సర్వజీవులయందును ప్రకాశించేది భగవంతుడే. సర్వ గుణంబులందును ఉన్నట్టిది భగవంతుడే ఇట్టి భగవంతునకు కేవలము అల్పమైన, స్వల్పమైనట్టి ఆరాధనలు సలిపి కేవలము మనయొక్క మనస్సును కూడను అల్పముగా భావిస్తున్నాము. కనుక భగవంతుణ్ణి విశాలమైనట్టి పవిత్ర స్వరూపునిగా భావించాలి. కేవలము భూమి మాత్రమే కాదు. కేవలము నక్షత్రములు మాత్రమే కాదు. కేవలము ఆకాశము మాత్రమే కాదు. సర్వమండలములు కూడను భగవంతునియొక్క స్వరూపమునే. ఇలాంటి భగవంతున్ని అల్పస్వరూపునిగా మనము ఆరాధించడము ఇది భగవంతునికే అవమానము చేసినట్టవుతుంది.

దక్షిణామూర్తి చెప్పాడు. 'విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ' అన్నాడు. ఈ విశ్వమంతా కూడను, ఇంత విశాలమైనట్టి విశ్వము చిన్న అద్దములో కనిపిస్తుంది. అదే విధముగనే అఖండ బ్రహ్మాండమైనట్టి దైవస్వరూపము, మన హృదయమనేటి చిన్న అద్దములోనే లీనమై ఉంటుండాలి. కనుక ఇంతటి విశాలమైనట్టి భగవంతుడు, మానవుని హృదయములోపల ప్రతిష్ఠింపబడ్డాడు. కనుకనే అతనికి 'హృదయవాసి' అన్నారు. ఈ హృదయవాసియైనట్టి భగవంతుని ఎవరు ఆరాధన చేసేది? నీవెవవరు? నీ హృదయమెవరిది? ఈ సత్యాన్ని గుర్తించుకుంటే నీవు అనేది ఏమాత్రము లేదు. ప్రపంచమంతయు కూడ దైవముతో ఏర్పడినట్టిది. నేను, ఇది అనే రెండు పదములతో ఉంటున్నది.

## ద్రష్ట-దృశ్యము

ఇది 'నేను' అనేటువంటిదే ద్రష్ట. 'ఇది' అనేటువంటిది దృశ్యము. ద్రష్ట, దృశ్యములయొక్క సంబంధమే యీ జగత్తంతా. ఈ విశాలమైన హాలులో యింత మంది కూర్చున్నారు. అయితే యిదంతా దృశ్యమే. చూచేదెవ్వరు? నేనే, కనుక నేను అనేటువంటిది ద్రష్ట. యీ కూర్చున్నట్టి వ్యక్తులనంతా, దృశ్యాన్ని చూస్తున్నారు కేవలము మరొక వ్యక్తిని మాత్రమే కాదు. నా దేహాన్ని నేను చూచుకుంటున్నాను. దేహము, ఇది దృశ్యము. కాని



srisathyasaivachanamrutam

చూచేటటువంటి వారు నేను. ఈ కన్నులు, చెవులు సర్వాంగములు కూడను యీ యొక్క దేహమునందే ఉంటున్నాయి. కాని చూచేదెవరు? అదియే సాక్షీభూతుడైనటువంటి ఒక ద్రష్ట. కనుక దృశ్యాన్ని చూచి మనము ఆనందించకూడదు. ఈ దృశ్యానికి మూలకారకుడైనట్టి ద్రష్టను చూచి ఆనందించాలి. ద్రష్టను చూచేటంటి దృష్టి యీ యొక్క చర్మ చక్షువులు కాదు. ఈ చర్మ చక్షువులకు జ్ఞాన చక్షువులు మనము జోడించు కోవాలి. బ్రతికినంతకాలము చర్మచక్షువులుతోనే యీ యొక్క జగత్తును చూచి, యీ జన్మాన్ని సార్థకము కావించుకోవడానికి ప్రయత్నిస్తున్నాము చర్మ చక్షువులచేత చూచినటువంటి దానివల్ల సార్థకము ఏనాటికిని మనకు లభ్యము కాదు. జ్ఞాన నేత్రములతో మనము చూడాలి. కనుక జ్ఞాన నేత్రమనగా ఏమిటి? అంతర్భూతమైన దృష్టిని మనం అభివృద్ధి పరచుకోవాలి.

దీనికొక చిన్న ఉదాహరణము. మానవత్వంలోపల అనేక విధములైనట్టి స్వరూపాలుంటున్నాయి. జడము ఉంటున్నాది, చైతన్యము ఉంటున్నాది. అయితే యీ జడ చైతన్యములు రెండుకూడను దైవస్వరూపాలే కాని జడమును మనము అలక్ష్యము చేస్తున్నాము. కాని యీ చైతన్యస్వరూపుడు సర్పములు మొదలుకొని, ఎలుకలు మొదలుకొని చిన్న చిన్న జీవరాశులుకూడను దైవస్వరూపులే. ఈ విచిత్రమైనట్టి భావములు నేర్పే నిమిత్తమై ఈశ్వరుడు తన ఆభరణములంతా పాములుగా ధరించాడు. ఈ సర్పములు భగవంతునియొక్క దేహములో ఉండినంతవరకు, అవికూడ యితరుల నమస్కారములు అందుకుంటుంటాయి. కానీ, ఆ దైవమును విడిచిపోయిన తనను చంపుతారు. ఈ పాములకు అంత విలువనిచ్చినదేది? దైవముయొక్క స్వరూపమే. వినాయకుడున్నాడు. ఈ వినాయకుని దగ్గర ఎలుక ఉంటుంది. ఎలుకకు కూడా నైవేద్యము చేస్తున్నాము. మూషిక వాహనుడని వర్ణిస్తున్నాము. కాని ఆ మూషికమే వినాయకునికి కొంచెం దూరం పోతే దానిని బోను పెట్టి పట్టేస్తాము. తలను కొట్టేస్తాము. కనుకనే దైవముతో కూడుకున్నదంతయు కూడ ఒక విధమైనట్టి గౌరవమర్యాదలు లభిస్తుంటాయి.

కనుక మనమందరము కూడ దైవముతో కూడుకున్నట్టి వారమే అనేటువంటి

srisathyasaivacharamrutam

సత్యాన్ని మీరు గుర్తించాలి. దేహములో వివిధమైనట్టి అంగములుండినట్లుగ దైవముయొక్క దేహములోపల యీ విధమైనట్టి స్వరూపాలు కూడ ఉంటున్నాయి. కాని అన్ని రూపములు కూడను దైవస్వరూపమే. 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్' కాబట్టి సహస్రనేత్రములనగా ఏమిటి? అందరివికూడను భగవంతునియొక్క నేత్రములే. అందరి శిరస్సులు కూడను భగవంతునియొక్క శిరస్సులే. అందరి పాదములుకూడా భగవంతునియొక్క పాదములే. ఈ విధమైనట్టి విశాలమైనట్టి విశ్వాసాన్ని అభివృద్ధి గావించుకున్నప్పుడే, దివ్యత్వమనేటి దానిని అర్థము చేసుకున్న వారమవుతాము. కాని రాతి నందిని చూస్తే మ్రొక్కుతాము. సజీవమైనట్టి నందిని చూస్తే దానిని అనేక రకములైనట్టి కష్టములు పెట్టి కొడ్తుంటారు. సజీవుడైన దానిని శిక్షిస్తున్నాము. నిర్జీవమైనట్టి దానిని పూజిస్తున్నాము.

**రూపనామాలన్నీ భగవంతునివే**

ఇదియే మానవులందున్నట్టి పెద్ద అజ్ఞానము. అన్ని రూపములు కూడను భగవంతునియొక్క స్వరూపమే. అన్ని నామాలు కూడను భగవంతునియొక్క నామములే. ఈ సత్యాన్ని మనము మొట్టమొదట గుర్తించడానికి ప్రయత్నించాలి. ఏ యొక్క ప్రాణికూడను పిపీలికాది బ్రహ్మ పర్యంతము కూడను, తానే ఉంటున్నాడు కనుకనే ఓ భగవంతుడా! నిన్ను వర్ణించుటకు వీలుకాదు. నిన్ను పొగడతరమా! నిన్ను పొగడతరమా! ఎవరు పొగడ గలరు నిన్ను? ఎవరు నిన్ను వర్ణించగలరు? ఎవరూ వర్ణించలేరు.

**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె అతి గణనీయుడవు**
**ఎనుబదినాలుగు లక్షల జీవముల**
**అనయమ్మును నెడబాయకుందువట**
**అణురేణు తృణకాష్టము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుచుందువట**
**ఘనమగు దొంగలలో గజదొంగవు**



sri sathyasaivachanamrutam

## నిను కనుగొనగలమా కృష్ణా!

సత్యము కానట్టిది జగత్తునందే లేదు. సత్యాన్వేషణ, సత్యాన్వేషణ అనుకుంటున్నారు. ఎక్కడుందో తెలియకుండా ఉండేటట్టి సత్యాన్ని వెదకడం జరుగుతుంది. సర్వత్రా ఉండినట్టి సత్యాన్ని వెదికేదెందుకు? ఇంటిలోన దీపము వెలుగుచునుండగ, పొరుగింటి అగ్గికై అరుగనేల? నీ యింటిలో నున్నట్టిది వెలుగుతుండాది. నీవు పొరుగింటి కెందుకు అగ్గికోసం వెళ్తున్నావు? నీ వెలుతురిని నీవు అభివృద్ధి పరచుకో. దీనికంటే మించినది మరొకటిలేదు. అందరియందు కూడను, దివ్యజ్యోతి, అఖండజ్యోతి, అద్వైతజ్యోతి, అదియే మానవ జీవనజ్యోతి. ఇటువంటి జీవనజ్యోతిని మన చెంతనే పెట్టుకుని, చింతిస్తూ, వేరొక జ్యోతిని వెలిగించుకోవడమెందుకు? వెలిగే జ్యోతిని చూడడానికి, ఇంకో జ్యోతి అవసరమా? వెలిగే జ్యోతిని చూడడానికి వెలుగే మనకు ఆనందముగా ఉంటుంది. ప్రకాశించేటువంటి చంద్రున్ని చూడాలనుకుంటే ఒక టార్చిలైటు, హరికెన్‌లాంతరు, పెట్రోమాక్స్ లైటో మనకక్కరలేదు. చంద్రునియొక్క ప్రకాశముచేతనే చంద్రుని చూడవచ్చు. అదే విధముగనే మానవ జీవనజ్యోతి ద్వారానే దైవజ్యోతిని, విశ్వజ్యోతిని, పరమాత్మజ్యోతిని చూడవచ్చును. దీనిని నిత్యము మనము చూడాలంటే, జీవనజ్యోతి ద్వారానే చూడాలి. ఈ జీవనజ్యోతి దైవజ్యోతియొక్క ప్రతిబింబమే. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' అలాంటి ప్రతిబింబమైనట్టి దైవత్వాన్ని మన ప్రతిబింబమైనట్టి జీవత్వాన్ని ఏకంగా మనము భావించుకోవాలి. జీవుడే దేవుడు, దేవుడే జీవుడు. కనుక రెండింటియొక్క ఏకత్వాన్ని మనము గుర్తించుకున్నప్పుడే దివ్యత్వం అనేది మనకు బోధపడుతుంది.

### అనేకత్వంలో ఏకత్వాన్ని చూడాలి

దీనినే 'శరణాగతి' అన్నారు. సచ్చిదానందం. ఈ శరణాగతి అనేటి పదములోపల మూడు రకములైనట్టి స్థానములు కనిపిస్తాయి. శరణాగతి చేసేటంటివాడు ఒకడు చేయించుకునే వాడొకడు. శరణాగతి మరొకటి మూడుగా కనిపిస్తాయి. కనుక లోకసంబంధమైనట్టి లెక్కలలోపల మూడు ఉంటున్నాయి. 3-1=2 అంటారు. కాని ఆధ్యాత్మికములో ఇది సరికాదు. 3-1=1. ఇది ఎట్లా అవుతుంది? దీనికి వాదోపవాదములు

srisathyasaivachanamrutam

జరుగుతుంటాయి. మన యింటిలో ఒక అద్దముంది. అద్దముముందు నీవు పోయి నిల్చుకున్నావు. ఈ నిల్చుకున్నప్పటికి అద్దములో నీ ప్రతిబింబము కనిపిస్తుండాది. నీవు, ప్రతిబింబము, అద్దము మూడు ఉంటున్నాయి. అయితే యీ మూడింటియందు ఆ అద్దము తీసివేసేస్తే ప్రతిబింబము కూడపోతుంది. కేవలము బింబము మాత్రమే మిగులుతుంది. అదే 'ఏకంసత్ విప్రా బహుధా వదంతి'. కనుకనే మనము దైవత్వాన్ని గుర్తించడానికి మనయొక్క దేహభ్రాంతి అనేది క్రమక్రమేణా చల్లారాలి. ఈ దేహమనేటువంటిది ఒక అద్దము వంటిది దీనిలో జీవతత్త్వమనేటిది ప్రతిబింబముగా ఉంటుంది. ఈ ప్రతిబింబములకు మూలాధారము ఏమిటి? బింబమైనటువంటి ఆత్మతత్త్వమే. జీవుడు, దేవుడూ ఒక్కటే కాని అడ్డుగా అద్దము మాత్రమే కనిపిస్తుంది. ఈ ప్రపంచమనేటి అద్దములోపల అనేక రూపాలను చూస్తున్నాము. ఆ అద్దముకూడ మట్టే. అదికూడ ప్రకృతికి సంబందించినట్టిదే. ఈ ప్రకృతి కూడను భగవత్స్వరూపుడే సర్వమూ భగవత్ స్వరూపమైనప్పుడు బేధమునకు ఏమాత్రము అవకాశముండదు. దీనిని పురస్కరించుకొనియే ప్రాచీనులైన పండితులు 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అన్నారు. ఉన్నది ఒక్కటే అయినప్పటికిని అనేకత్వముగా భావిస్తూ వస్తున్నారు. కనుక ఏకత్వాన్ని అనేకత్వముగా విభజించరాదు, అనేకత్వాన్ని ఏకత్వంగా విశ్వసించడము అవసరము.

ప్రేమస్వరూపులారా! మీరు ప్రేమస్వరూపులంటే ఒక స్వరూపముగా ధరించినట్టివారు. అందరియందు ఉన్నటువంటి ప్రేమ ఒక్కటే. ఈ ప్రేమ అనే దానిని మనము ఆధారము చేసుకుంటే సర్వమూ యీ ప్రేమయందే ఆవిర్భవిస్తాయి. ప్రేమ లేనటువంటి తత్త్వము మరొకటి లేదు. Love is GOD, Live in LOVE. ఈయొక్క దైవత్వమనేటిది ప్రేమనే. ఈ ప్రేమకు ఆద్యంతములు లేవు. అణువుకంటె సూక్ష్మంగా ఉంటాడు. ఘనముకంటె అతి ఘనముగా ఉంటాడు. కనుక యిట్టి దానిని మనము విభజించడము, వేరు వేరుగా భావించడము, యిది సరియైనట్టి అర్థము కాదు. సర్వత్రా ఉన్నటువంటిది ప్రేమతత్త్వమే. సర్వస్వరూపములు ప్రేమస్వరూపములే. సర్వమార్గములు ప్రేమమార్గములే. సర్వసాధనలు కూడ ప్రేమయొక్క సాధనలే. సర్వగమ్యములు కూడను ప్రేమనే. అనంతమైనట్టి జగత్తునందు అఖిలమానవ కోటిలో ఉన్నది ఒక్క ప్రేమనే. కనుక యిట్టి ప్రేమతత్త్వాన్ని

మనము అనుభవించాలి. ఎట్టి సమయములో కూడా మనము ప్రేమ మాత్రము వదలకూడదు. కొన్ని సమయములలో యీ ప్రాకృతమైనట్టి జీవితానికి, ద్వేషములు, అసూయలు, కష్టములు, అహంకారములు, మమకారములు యిత్యాది కొన్ని అవ లక్షణాలు మనలో ఆవిర్భవిస్తుంటాయి. ఆ వచ్చినట్టి అసూయను కూడను మనము ప్రేమగానే తీసుకోవాలి. దానిని కూడను నీవు ప్రేమగా భావించు. అప్పుడు ద్వేషమునకు అవకాశమే లేదు. ద్వేషము వచ్చేదెప్పుడు? రెండు వ్యక్తులుగా ఉన్నప్పుడే ఒకరిపైన ఒకరికి ద్వేషము వస్తుంది. రెండు భావములుగా ఉన్నప్పుడే ఒకరిపైన ఒకరికి అసూయ కలుగుతుంది. రెండు భావాలు పెట్టుకోవద్దు. రెండు మనసులు ఉండవచ్చును కాని ఒకే భావమే వుండాలి. అనేక బల్బులు ఉన్నప్పటికిని ఒకే కరెంటు. కాబట్టి ఆత్మ అనేది అన్ని దేహములయందును ఏకత్వముగా ఉంటుంది. కనుకనే 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అందరియందు కూడను ఏకంగానే ఉంటున్నాది. ఇలాంటి ఏకాత్మ భావాన్ని మనము అభివృద్ధి పరచుకుని ప్రేమతత్త్వాన్ని మనము చక్కగా పోషించుకుని దివ్యాత్మస్వరూపులుగా రూపొందాలి. ఇదియే నిజమైన సాధన. అంతే కాని చిన్న, చిన్న రూపాలను మాత్రము ఆరాధిస్తూ, చిన్న, చిన్న పేర్లంతా కూడా పెట్టుకుని, యీ పేరుకు యీ రూపము, యీ పేరుకు యీ రూపమని నిర్ణయించుకుని దైవస్వరూపాన్ని కూడ మనము చాలా సంకుచితము పరుస్తున్నాము. అన్ని రూపములు భగవంతుడే. ఇలాంటి భావాన్ని మనము పెట్టుకున్నప్పుడు క్రమక్రమేణా కొంతకాలమునకు మనకు అట్టి భావము ఏర్పడుతుంది.

తుమ్మెద ఒక చిన్న గూడు కట్టుకుంటుంది. అందులో ఒక పురుగు తెచ్చి పెట్టుకుంటుంది. దానిలోపల అన్ని ద్వారములు మూసివేస్తుంది. కాని ఒక ద్వారము మాత్రము పెట్టుకుని అక్కడ ఘీమని తిరుగుతుంటాది. కాని లోపల పెట్టినటువంటి పురుగుకు ప్రపంచమంతా కూడను ఏమి తెలియదు. ఈ తుమ్మెద చేసే శబ్దానికి మాత్రమే లక్ష్యమిస్తుంది. ఈ శబ్దము విని, విని, విని కడపటికి ఏమవుతుంది? కీటకము భ్రమరంగా మారిపోతుంది. అదే విధముగనే మానవాకారములో నున్నటువంటి మీరు, నిరంతరము దైవభావాన్ని అభివృద్ధి పరచుకున్న మీరు కూడను దైవస్వరూపులుగా మారిపోతారు. 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' మీరే బ్రహ్మ స్వరూపాన్ని పొందుతారు. బ్రహ్మతత్త్వాన్ని

sri sathyasai vachanamrutam

పొందాలనుకున్నప్పుడు బ్రహ్మభావాన్నే చింతిస్తుండాలి. ఎక్కడ? సర్వదా సర్వకాలేషు సర్వత్రా బ్రహ్మ చింతనం. అన్ని సమయములందు కూడను, అన్ని కాలములయందు అన్ని పరిస్థితులయందు , యీ విధమైనట్టి దైవత్వాన్ని మనము పొందడానికి ఇదియే సరియైన మార్గము మనము ప్రపంచాన్ని తిరుగనక్కరలేదు. డబ్బు ఖర్చు పెట్టనక్కరలేదు. ఈ విధమైన శ్రమపడి అనేక విధములైనట్టి కష్టములకు గురి అయిపోయి, ధనమును వ్యర్థము చేసి, మనము దైవత్వాన్ని చూడాలి అనే ఆశతో మనము ప్రయాణము చేయకూడదు.

మీరే దైవస్వరూపులు. ఆ విధముగా భావించుకోండి. క్రమక్రమేణా కృష్ణుడెవరు? మీరే. రాముడెవరు? మీరే. ఈశ్వరుడెవరు? మీరే. విష్ణుదెవరు? మీరే. అంతా మీరే. కనుక ఇవన్నీ పెట్టిన పేర్లేకాని, పుట్టిన పేర్లు కావు. మీ పేర్లంతా కూడను తల్లితండ్రులు పెట్టినట్టివి. దేహము తల్లిదండ్రులిచ్చినటు వంటిదే. కానీ దేవుడిచ్చింది ఏది? అదే హృదయము. అది లేకుండడానికి వీలుకాదు. ఇది మనయొక్క స్వాధీనములో లేదు. కనుకనే యీ దేహానికి పెట్టిన పేర్లు. దేహ ఆకారమునకిచ్చినట్టి రూపములు తల్లితండ్రులయొక్క ప్రసాదములే కాని హృదయమనేటువంటిది ఎవరూ యివ్వడానికి వీలుకాదు. సహజముగా ఆవిర్భవించినట్టిదే. ఈ హృదయమనేటట్టిది సర్వులయొక్క తత్త్వము. ఒకరి దగ్గరనుంచి పుచ్చుకునేది కాని, ఇంకొకరికి యిచ్చేదికాని కాదు. ఈ హృదయాన్ని యిచ్చుకోవడానికి మనము ప్రయత్నం చేయాలి. కాని యీ హృదయాన్ని యిచ్చుకునేలోపల oneway traffic గా ఉండాలి. ఇచ్చుకో, ఇచ్చుకో, ఇచ్చుకో. పుచ్చుకోవడానికి ప్రయత్నము చేయొద్దు. ఇచ్చుకోవడం, పుచ్చుకోవడము ఉంటే రెండు హృదయములుగా మారిపోతాయి. ఒకే హృదయమే.

**దేహమే దేవాలయం**

ఏకాత్మ భావాన్ని పెట్టుకోండి. ఈ ఏకాంతస్థితి వచ్చేవరకు కొన్ని సాధనలు మాత్రము చేయండి. నచ్చిన ఏకాత్మభావము పెట్టుకోండి. సాధన అనేకంగా సాధన చేయండి. తప్పులేదు. కాని యీనాడు సాధనలు చేస్తున్నారు. ఏమి సాధనలు చేస్తున్నారు? ప్రాకృతమైనట్టి సాధనలు చేస్తున్నారు. జపమాల త్రిప్పుతూ ఉంటారు. మాల తిరగుతుండాది కాని మనసంతా తిరుగుతుండాది. చెయ్యి మాల త్రిప్పుతుంటాది. మనస్సు మార్కెట్టు పోతుండాది. ఈ జపము

srisathyasaivachanamrutam

ఎందుకోసం? వెళ్ళి ధ్యానములో కూర్చుంటారు. కదలక మెదలక కూర్చుంటారు, యిది ధ్యానమని. ఒక చిన్న అణుమాత్రము దోమ వాలితే తక్షణమే దానిని కొట్టేస్తారు. ఇంత పెద్ద దేహముపైన ఇంత చిన్న దోమ వ్రాలితే ఏమి నష్టమైంది? ఆ చిన్న దోమ యీ దేహముపైన వ్రాలి, ఈ దేహము యొక్క అభిమానాన్ని పెంచుతూ వస్తుందాది. ఇంత చిన్న దోమ చిక్కినప్పటికిని దేహము భరించుకోలేకుండా ఉంటుంది. ఇంత అపరాధంతో కూడినటువంటిదీ దేహము. ఇంత సంకుచిత భావాలతో కూడినటువంటిదీ దేహము. కనుకనే ఇలాంటి దేహమును మనమేమాత్రము లక్ష్యము చేయవద్దు. మనిషికి ఏమైనా జరుగవచ్చు. కానీ దేహమునకే గాని ఆత్మకు సంబంధము లేదు. ఆత్మే నాయొక్క దైవము. దానిని నివాసము చేసుకున్నట్టిదే యీ దేహము 'దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవస్సనాతనః' Body is the Temple of GOD. కాబట్టి ఈ దేహము అనేటి గుడియందు, ఒక్కొక్క గుడియందు కూడను ఆత్మ అనేటి దేవుడు ప్రతిష్ట అయియున్నాడు. కనుక దేహాత్మ రెండింటియొక్క ఏకత్వాన్ని మీరు గుర్తిస్తారు.

ఈ దేహములో అనేక అంగములుంటున్నాయి. ఈ అంగములంతా ఏమిటి? దేహానికి అంగములు. ఈ అంగములకు ఏది కారణము? ఈ సమాజమే కారణము. సమాజమునకు ఏది కారణము? ప్రకృతియే కారణము. ప్రకృతికి ఏది కారణము? భగవంతుడే కారణము. కనుక యీ ప్రకృతంతా పరమాత్మయందే ఆవిర్భవించినట్టిది. కాబట్టి ఒక దానికి ఒకటి ప్రభువుగా ఏర్పడుతున్నది. ఈ విధముగా మనము విచారణ చేసి అన్నిటియొక్క ఏకత్వాన్ని మనము తీసుకోవాలి. కనుకనే ఆనాటి ప్రాచీన బ్రహ్మణులంతా కూడను 'అన్నం బ్రహ్మ' అన్నారు. 'ఓ దైవమా! ఈ తినినటువంటి అన్నము జనములో సర్వత్రా ప్రసాదించి, యీ దేహానికి శక్తినందించు'. ఎందుకోసమీ శక్తి? మీయొక్క ధర్మాన్ని ఆచరించే కోసమే, మీయొక్క సేవను ఆచరించే కోసమే, దేహానికి శక్తినిచ్చేది. ఇంక మనస్సు కోరుతున్నది 'రసో విష్ణుః'. ఈ రసస్వరూపమైనట్టి విష్ణువు ఎవరు? మనస్సే. మనస్సుకూడ ప్రార్థిస్తున్నది. దేహాన్ని కాపాడుకుని, యిది సరియైనట్టి మార్గములో ప్రసరింపచేసి సత్సంగములో నేను ఉండేటట్లుగా నాకు సద్బుద్ధిని యిమ్మని చెప్పింది. ఇక తరువాత వాక్కు, వాక్కు ఏమి చెప్తుందాది? అందమైన దేహాన్నిచ్చావు. స్వచ్ఛమైన మనసునిచ్చావు. పవిత్రమైన వాక్కును నాకు ప్రవేశపెట్టు. కాబట్టి

srisathyasaivachanamrutam

బ్రహ్మనుంచి విష్ణువు. విష్ణువునుంచి యీశ్వరత్వం. దేహమే బ్రహ్మ. మనస్సు విష్ణువు. వాక్కే యీశ్వరుడు. ఈ ముగ్గురి స్వరూపాన్ని మనము కాపాడుకోవడం అత్యవసరం.

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.**

ఈ త్రిగుణములతో కూడినట్టిది యీ దేహము. ఇందులో ఒక్కొక్క దానిలో నున్నది, మనసుయందున్నది, వాక్కునందున్నది. దేహమునందున్నది. ఆత్మ త్రిదళాకరం బిల్వపత్రముంటుండాది. త్రిదళాకారంగా కాబట్టి దేహము, మనస్సు, వాక్ యీ మూడు కూడను త్రిదళముగా ఉంటుండాది. దేహాధారము ఆత్మనే. కనుక త్రిగుణంతో కూడినట్టి యీ బిల్వమును నీకు అర్పితము చేస్తున్నాను. దీనిని పురస్కరించుకొనియే సచ్చిదానందం 'శరణాగతి' అన్నాడు. శరణాగతి అనగా అన్నింటియొక్క ఏకత్వమే శరణాగతి.

**శరణాగతి తత్వం**

ఒకానొక సమయములోపల రాముడు అరణ్యవాసము చేస్తున్న సమయములో రామ, లక్ష్మణ, సీత ముగ్గురు కూడను చిత్రకూట పర్వతము చేరారు. కాని రాముడు అలసినట్లుగా నటన చేశాడు. లక్ష్మణా! నీ వదినగారు చాలా అలసిపోయినట్టుగా ఉన్నాది. మనమిక యీ పది సంవత్సరములు యిక్కడే ఉండవలసి వస్తుంది. కాబట్టి ఒక పర్ణశాల నిర్మించు అన్నాడు. లక్ష్మణుడు ఎక్కడన్నా? అన్నాడు. నీకిష్టమైన చోట నిర్మించు అన్నాడు. "రామా! నేనేం పాపము చేశా"నని కూలబడ్డాడు, లక్ష్మణుడు. సీతకూడ చాలా ఆశ్చర్యపడింది. "ఏమన్నారు! మీ అన్నగారు! నిన్నేమీ జంతువునేమీ కొట్ట మనలేదు కదా! ఎందుకింత బాధపడుతున్నా"వని అడిగింది, సీత. "తల్లీ! ఇంతకంటే వేరొకటి దోషముందా! నేను సర్వమును యితనికి అర్పితము చేశాను. 'మదీయ ధనదారాది సర్వభార సమర్పితం, అత్మత్బలం శేషభూతం, రక్షమాం శరణాగతి'. నాకు భార్య ఉంది. పిల్లలున్నారు. రాజ్యముంది. సర్వస్వాన్ని త్యాగము చేసి నేను రామునితో వచ్చాను. అలాంటి సమయములోపల నీ యిష్టం వచ్చినచోట కట్టమంటే నాకు యిష్టముందా? ఇంత కఠిన వాక్కుకంటే మరొక దూషణ ఉంటుందా? నేనేదో పాపం చేసా"నన్నాడు. ఈ విధముగా



sri sathyasai vachanamrutam

చేసేటప్పటికి, రాముడు వెళ్ళి, దయామయుడైనటువంటి రాముడు, 'లక్ష్మణా! పొరపాటు అని అంగీకరించాడు. నీవు వేరుగా భావించవద్దు నీవు ఫలానిచోట వెళ్ళి ఆశ్రమము కట్టు' అన్నాడు. తర్వాత సీతను పర్ణశాలలో పెట్టి రాముడు, లక్ష్మణుడు చుట్టు ప్రాంతాలను సంచారము చేస్తూ వచ్చారు.

రామునియొక్క చరణమే నాయొక్క శరణాగతి, చరణమే శరణమని భావించుకున్నటువంటి లక్ష్మణుడు, ఒక ప్రదేశమునకు పొయ్యేటప్పటికి లక్ష్మణుని మనసు మారిపోయింది. 'అన్నా! నేనిక యీ అడవిలో ఉండలేను. ఈ బాధలు నేను సహించలేను. నేను అయోధ్యకు వెళ్తా"నన్నాడు. రాముడు నవ్వుతూ తొందరపడకు, తొందరపడకు చేయి పట్టుకుని ఒకచోటికి పర్యటిద్దాం రమ్మన్నాడు. పర్ణశాలకు పోయి దీనిని విచారిద్దాం అన్నాడు. కొంత దూరము లక్ష్మణుడు వచ్చి, ఒక చల్లని ఛాయతో ఉన్నట్టి ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు. అప్పటికి లక్ష్మణుని మనసు మారిపోయింది. ఏం లక్ష్మణా! ఎప్పుడు వెళ్తున్నావు అయోధ్యకు అని ప్రశ్నించాడు, రాముడు. రామా! అయోధ్యతో నాకేం పని ఉంది? సర్వమూ నీవే. అలాంటి రామున్ని వదలి నేను అయోధ్యకు వెళ్ళడము నా కలలో కూడ ఆ భావము లేదన్నాడు. మరికొంత దూరము పోయి నీవు అయోధ్య వెళ్తానని చెప్పావు కదా అన్నాడు. దానికి కారణమేమిటో నాకు తెలియదు. అప్పుడు రాముడు చెప్తున్నాడు. లక్ష్మణా! స్థానబలము కూడా ఉంటుంది. స్థానబలముతో బాటు తన బలముకూడ కొంత చూచుకోవాలి. భగవంతునినుంచి దూరము పోవడానికి ఆ స్థలమహాత్యమే. ఎందుకంటే ఆ స్థలములోపల శూర్పణఖ సంచరించినట్టి స్థలము. అక్కడ శూర్పణఖ నివసించే స్థానములో మనము సంచరించాము. కనుక ఆ శూర్పణఖ భావాలే దేహములో ఆవిర్భవిస్తాయి. ఆ స్థానము దాటి మరొక స్థానములో వచ్చాము. చిత్రకూట పర్వతముపైన మహర్షులంతా నివసించేటువంటి ప్రదేశము ఇక్కడకు వచ్చేసరికి మహర్షులయొక్క భావమంతా వచ్చేసింది.

కనుక మన స్థానముకూడను పవిత్రమైనట్టి స్థానముగా ఉండాలి. దుర్మార్గులు, దుష్టులు, సంచరించేటంటి ప్రదేశముగా ఉండకూడదు. కనుకనే 'త్యజ దుర్జన సంపర్కం'. ఈ చెడ్డనేది మనకు వచ్చిందంటే దానినుంచి బయటపోవాలి మనము. అందుకే స్మరించు 'భజ సాధు

sri sathyasai vahini amrutam

సమాగమం’ ‘కురు పుణ్య మహోరాత్రం’. అదే మనము చేయవలసినట్టి సాధనలు. చెడ్డదానిని వదలాలి. మంచిదానితో సంబంధము పెంచుకోవాలి. నిరంతరము మంచినే చేస్తూ జీవించాలి. ‘స్మరనిత్య మనిత్యతాం’. ఏది నిత్యమో, ఏది అనిత్యమో అనేటంటి విచారణ చేయాలి. ఈ దేహము అనిత్యము, ఈ ప్రకృతి అనిత్యమే, భావములు అనిత్యమే, కంటికి కనిపించే దృశ్యములన్నియు కూడను అనిత్యమే. కాని నిత్యసత్యమైనట్టిది ఆత్మతత్త్వమొక్కటే. దానిని ఆశ్రయించడమే శరణాగతి అన్నారు. కనుక ఆత్మభావమును మనము పెంచుకుని, నిరంతరము ఆత్మచింతనతోనే మన జీవితము సార్థకము గావించుకోవాలి. ఈ విధమైనట్టి సాధనలు చేసినప్పుడు దైవము మన వెంటనే, జంటనే, యింటనే, కంటనే, ఉంటుండి అన్ని విధములుగా కాపాడుతాడు.

**(తేదీ 23-04-1998న కొడైకెనాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam